సాక్షి
వికారాబాద్

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



పాఠశాలలకు ప్రహరీ ఏదీ?
ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో▸



లక్ష్యసాధనకు కృషి చేయాలి
ఆటంకాలు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. 8లో▸



ఆయకట్టుకు నీరందేనా..?
నోటిఫైడ్ చెరువులకు మరమ్మతులు చేపట్టక ఆయకట్టు రైతులకు నీరందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఏఎంసీ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి



మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే టీఆర్‌ఆర్, ఏఎంసీ చైర్మన్ పరుశాంరెడ్డి

పరిగి: పరిగి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాంరెడ్డి కోరారు. శుక్రవారం వారు మినిస్టర్ క్వార్టర్‌లో మంత్రిని కలిసి మార్కెట్ కమిటీ అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారని చెప్పారు.

జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా భాస్కరయోగి



భాస్కరయోగికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు భాస్కరయోగి జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆయనకు అవార్డు అందజేశారు. విద్యార్థులకు మంచి విద్యను అందించిన వారికి ప్రభుత్వం గుర్తిస్తుందని కలెక్టర్ అన్నారు. అవార్డు అందుకున్న భాస్కరయోగిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అనన్యకు భారత్ కె అన్మోల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న గడ్డం అనన్య

అనంతగిరి: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌ల తాజ్ దక్కన్‌లో శుక్రవారం అవార్డు ఫర్ ఉమెన్ ఆన్ ఎక్సలెన్సీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్యాక్(జీవైవైఏకే) ట్రస్టీ గడ్డ అనన్య భారత్ కె అన్మోల్ అవార్డు అందుకున్నారు. న్యూస్ యూ లైక్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ మెంబర్ కుష్భూ సుందర్, కూచిపూడి నర్తకి పద్మశ్రీ డాక్టర్ జి.పద్మజారెడ్డి, పారిశ్రామిక వేత్త రూప మాగంటి, ఆర్గనైజర్, అంబాసిడర్ ఫర్ పీస్ డాక్టర్ మహ్మద్‌నిజాముద్దీన్ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు గిరిజన విద్యార్థి రంజిత్



రంజిత్‌కుమార్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

యాలాల: డిస్కస్‌త్రో విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు మండల పరిధిలోని దేవనూరు అనుబంధ గ్రామం దుబ్బతండాకు చెందిన రంజిత్‌కుమార్ ఎంపికయ్యాడు. వికారాబాద్‌లో పాలిటెక్నిక్ చదువుతున్న రంజిత్‌కుమార్ ఫిబ్రవరి 12న నగరంలోని రామంతాపూర్‌లో నిర్వహించిన స్టేట్ లెవల్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో ఆయన్ను దక్షిణ భారత దేశం నుంచి జాతీయ స్థాయి డిస్కస్ త్రో పోటీలకు అర్హత సాధించాడు. డిస్కస్ త్రోలో సౌత్ జోన్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన దుబ్బతండా గిరిజన విద్యార్థికి మండలంలోని నాయకులు, యువకులు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రంతో పాటు తండాకు మంచిపేరు తీసుకురావాలని పట్టుదలతో ముందుకు సాగుతున్నట్లు రంజిత్ కుమార్ పేర్కొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

పట్టణ శివారులో వెలిసిన భక్తుల ఇలవేల్పు బండల ఎల్లమ్మ తల్లి జాతర వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం మహిళలు అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. సాయంత్రం 6.30గంటలకు రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్తలు అమృతారెడ్డి, రాంరెడ్డి, రాఘువేందర్‌రెడ్డి భక్తులకు ఇబ్బంది లేకుండా జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసుల బందోబస్తు నడుమ రథోత్సవం కనులపండువగా సాగింది.

– కొడంగల్



నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ



తాండూరు రూరల్: పెద్దేముల్ మండల పరిధిలో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీఓ రతన్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందనెల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ కొడంగల్ మండలం ఉడిమేశ్వరానికి, జనగాం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ తాండూరు మండలం సంకిరెడ్డిపల్లికి, ఆత్కూర్ పంచాయతీ సెక్రటరీ అర్చన రేగొండి గ్రామానికి, మదనంతపూర్ పంచాయతీ కార్యదర్శి మునీరుద్దీన్ జనగాం గ్రామానికి బదిలీ చేశారు. రెగొండి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను రిజర్వులో ఉంచారు.

కంది బోర్డు తిప్పేసినట్లేనా!

దశాబ్దాలుగా ఎన్నికల హామీకే పరిమితం



తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం

- జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల ఎకరాల్లో పంటసాగు
- ప్రతిపాదనలు పంపుతున్న శాస్త్రవేత్తలు
- పట్టించుకోని ప్రభుత్వాలు

తాండూరు: తాండూరు కందులు, పప్పునకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తాండూరులో కంది పరిశోధనలు విస్తృతమవుతాయని శాస్త్రవేత్తలు, రైతులు భావించారు. కానీ రాజకీయ పార్టీలు మాత్రం కంది బోర్డును ఎన్నికల అస్త్రంగా మార్చుకున్నారు. తాండూరు కంది పప్పునకు భౌగోళిక గుర్తింపు లభించినప్పటికీ డిమాండ్ మాత్రం అనుకున్నంతగా పెరగలేదు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ కంది బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకటనకే పరిమితమైంది. రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు, పశ్చిమగోదావరి జిల్లాలోని మారుతేరులో రైస్ రీసెర్చ్ స్టేషన్‌కు ఏపీ రైస్ రీసెర్చ్ స్టేషన్‌గా హోదా కల్పిస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. తాండూరు కంది బోర్డు విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు వాపోతున్నారు.

ఎక్కువ ఉత్పాదకత ఇక్కడే..

జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో రైతులు కంది సాగు చేస్తున్నారు. జిల్లా పునర్విభజన తర్వాత కంది పంట విస్తీర్ణం మరింత పెరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కంది ఉత్పాదకత జిల్లాలోనే ఎక్కువగా ఉంది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత కంది బోర్డు ఏర్పాటు చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఏడేళ్ల క్రితం 1.30లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేయగా ప్రస్తుతం రెండు లక్షల వరకు పెరిగింది.



పార్లమెంట్ సమావేశాల్లోనూ ప్రస్తావించని ఎంపీ

లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీల నేతలు తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు గుప్పించారు. చెవేళ్ల ఎంపీగా విజయం సాధించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రెండు నెలల క్రితం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో మాత్రం కంది బోర్డు విషయం ప్రస్తావించలేదు. 20 ఏళ్లుగా కంది బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమాలు చేస్తున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బోర్డు ఏర్పాటుతో లాభాలు

- కంది బోర్డు ఏర్పాటుతో వర్సిటీ స్థాయి శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారు
- బోర్డు ద్వారా పంట సాగు చేసే రైతులకు విత్తనాలు, ఎరువులు రుణంపై పంపిణీ చేస్తారు.
- పంట సాగుపై తరచూ శిక్షణ తరగతులు ఉంటాయి.
- కందుల కొనుగోళ్లపై ధరల నియంత్రణ ఉంటుంది.
- దళారుల బెడద లేకుండా మద్దతు ధర లభిస్తుంది.
- పరిశోధనలు విస్తృతమవుతాయి.
- పంటల సాగుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు బోర్డు కృషి చేస్తుంది.
- బోర్డుకు ఉండే ప్రత్యేక నిధుల ద్వారా కొత్త పరిశోధనలకు అవసరమైన చేయూత లభిస్తుంది.

రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు



తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వానికి రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపాం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి కదలిక లేదు. బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు కొత్త వంగడాలు అందుబాటులోకి వస్తాయి. కావాల్సిన ఎరువులు, విత్తనాలు పంపిణీ జరుగుతుంది. శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. తాండూరు కందిపప్పునకు భౌగోళిక గుర్తింపు లభించింది. కంది బోర్డు ఏర్పాటుపై స్పష్టత రాలేదు. బోర్డు ఏర్పాటైతే ప్రపంచంలో కందులకు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు అధిక ధరకు కందులను విక్రయించే అవకాశం ఉంటుంది. కంది బోర్డు ఏర్పాటు అయితే జిల్లా రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుంది.

– డాక్టర్ సుధాకర్, సీనియర్ శాస్త్రవేత్త, తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం

‘సహకారం’ పొడిగింపు!

పాలకవర్గాల పదవీకాలం మరో ఆరు నెలలు

- ఆగస్టు వరకు కొనసాగనున్న చైర్మన్లు, డైరెక్టర్లు
- ఉమ్మడి జిల్లాలో డీసీఎంఎస్, డీసీసీబీ, 51 పీఏసీఎస్, ఆరు ఎఫ్‌ఏసీఎస్‌లకు వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బషీరాబాద్: సహకార సంఘాల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ జీఓ ఆర్‌టీ 74 జారీ చేసింది. ఫిబ్రవరి 14తో పీఏసీఎస్, ఎఫ్‌ఏసీఎస్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ప్రభుత్వం తొలుత భావించినప్పటికీ పాలకవర్గాల పదవీకాలం పొడగింపునకే మొగ్గుచూపింది. దీంతో సొసైటీలు ఈ ఏడాది ఆగస్టు 14 వరకు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ పొడగింపుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో డీసీసీబీ, డీసీఎంఎస్‌తో పాటు 51 పీఏసీఎస్, ఆరు ఎఫ్‌ఏసీఎస్ పాలకవర్గాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు ఆగస్టు 14 వరకు తమ పదవుల్లో కొనసాగనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, వైస్ చైర్మన్ రవిగౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మధూకర్ రెడ్డి, డైరెక్టర్లు శుక్రవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పొడగింపు జీఓ కాపీని మంత్రి వారికి అందజేశారు.

తేలని బీసీ కులగణన

బీసీ కులగణన ఎటూ తేలకపోవడంతో లోకల్‌బాడీ ఎన్నికలన్నీ వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో సొసైటీలకు ప్రత్యేక అధికారులను నియమించడం కంటే పాలకవర్గాలను కొనసాగించమే ఉత్తమమార్గమని భావించిన కాంగ్రెస్ సర్కారు పాలకవర్గాలను పొడగించింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తరువాతే సొసైటీలకు ఎన్నికలు పెట్టే అవకాశం ఉండడంతో మరో ఏడాది పాటు సొసైటీలకు ఇవే పాలకవర్గాలు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా జీఓ కాపీని అందుకుంటున్న సహకార సంఘాల చైర్మన్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడి

భక్తులకు ఇబ్బందులు ఉండొద్దు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- అన్నిశాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి
- సీఎం రాక నేపథ్యంలో హెలిపాడ్‌కు స్థల పరిశీలన

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 24వరకు జరగనున్న ఉత్సవాలకు పొరుగు రాష్ట్రం నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వసతి అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో పాటు మిషన్ భగీరథ, ఎంపీడీఓలు ఇతర శాఖలకు సంబంధించిన అధికారులు ఈ నెల 19లకు పోలేపల్లికి చేరుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు, గొడవలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

21న ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో జాతర కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 21న రేవంత్‌రెడ్డి ఉత్సవాలకు హాజరవనున్నట్లు సమాచారం. ఇందుకుగాను గ్రామ శివారులోని దాదాపూర్ రోడ్డు మార్గం, హెలిపాడ్‌కు స్థల పరిశీలన చేశారు. గతంలో ఎమ్మెల్యే హోదాలో అమ్మవారిని దర్శించుకున్న ఆయన ప్రస్తుతం సీఎం హోదాలో రానున్నారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, చైర్మన్ జయరాములు, తహసీల్దార్ కిషన్, ఎస్ఐ యాదగిరి, ఆర్‌అండ్‌బీ అధికారులు, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీఓ తదితరులున్నారు.

కలెక్టర్ చొరవ అభినందనీయం

- రూ.25 లక్షలు వెచ్చించి 104 వసతి గృహాలకు వంట సామగ్రి అందజేత
- రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తోంది
- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



వార్డెన్లకు వంట సామగ్రి పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులు

అనంతగిరి: వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులను వార్డెన్లు తమ సొంత బిడ్డలుగా భావించి ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఉన్న 104 ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, ప్రభుత్వ, గురుకుల వసతిగృహాలకు రూ.25 లక్షల విలువైన వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు సమీకరించి వంట సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ హాస్టల్స్‌లో వసతుల కల్పనకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర బడ్జెట్‌లో ఏడు శాతానికి పైగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. ఈ వంట సామగ్రి వసతి గృహాల్లో వంటలు సులభంగా, పరిశుభ్రంగా చేసేందుకు ఉపకరిస్తాయన్నారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో 8లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారని చెప్పారు. ప్రజా ప్రభుత్వం పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచుతూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారని వివరించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతుందా లేదని అని పరిశీలించేందుకు ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. తెలంగాణలో మొదటి డీఎస్సీ ప్రకటన చేసి నియామకాలు చేపట్టిన ఘతన కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తున్నాం

కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాలు తనిఖీ చేసి బాలికలకు టాయిలెట్స్, వాష్‌రూమ్స్, తాగునీరు, ఫ్యాన్లు, లైట్స్ తదితర మౌలిక వసతులు లేవని గుర్తించామన్నారు. వాటిపై దృష్టి సారించి మౌలిక సవదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ వసతి గృహాలకు ఇడ్లీ పాత్రలు, గ్రైండర్, కడాయి, బొగానులు తదితర వంటసామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీఈఓ రేణుక దేవి, ఎస్సీ సంక్షేమ అధికారి మల్లేశం,ఉపేందర్, కమలాకర్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి

బంట్వారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే మరింత అభివృద్ధి సాధ్యమని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.30 కోట్ల నిధులతో కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. స్పీకర్ మాట్లాడుతూ.. మోత్కుపల్లి నుంచి అనంతగిరిపల్లి వరకు నిర్మిస్తున్న డబుల్ లేన్ రోడ్డుతో ప్రజల ప్రయాణాలు సులభతరమవుతాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఆర్‌అండ్‌బీ డీఈలు శ్రీధర్‌రెడ్డి, శ్రావణ్‌ప్రకాశ్, ఏఈలు రవికుమార్, సమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని 33 కేవీ లైన్ మరమ్మతులు, సబ్‌స్టేషన్ మెయింటనెన్స్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ అర్జున్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కొడంగల్, పెద్దనందిగామ, టేకుల్‌కోడ్, రావులపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

రంగంపల్లి ఫీడర్ పరిధిలో..

పరిగి: రంగంపల్లి ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పరిగి విద్యుత్ ఏఈ హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతు కారణంగా రంగంపల్లి, సొండేపూర్, రూప్‌ఖాన్‌పేట్, గడిసింగాపూర్, హీర్యానాయక్‌తండా, భోజ్యనాయక్‌తండా, మాల్కాయపేట తండా, చిగురాల్‌పల్లి, లక్నాపూర్, గోవింద్‌పూర్, ఇబ్రాహీంపూర్, గోవిందాపూర్‌తండాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోని అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలనలో వచ్చిన 3,200 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామని.. ప్రజాపాలన దరఖాస్తు దారులు తిరిగి ఆన్‌లైన్‌లో అప్లయి చేయాల్సిన అవసరం లేదన్నారు.

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: 2025–26 విద్యా సంవత్సరానికి గాను బంట్వారం మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బ్యూలా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతికి కొత్త అడ్మిషన్‌తో పాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఏప్రిల్ 13న ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్ష ఫీజు ఓసీలకు రూ.200లు, ఇతరులకు రూ.125లు ఉంటుందని వివరించారు.

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ బదిలీ

తాండూరు రూరల్: తాండూరు డివిజన్ లెవల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ)శంకర్ నాయక్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎల్‌పీఓ శంకర్ నాయక్‌ను నల్లగొండ జిల్లా దేవరకొండకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.

నేడు ప్రత్యేక సెలవు

బొంరాస్‌పేట: కొన్నాళ్లుగా సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలని గిరిజనులు కోరుతుండడంతో ప్రభుత్వం ప్రత్యేక సెలవుగా ప్రకటించడం హర్షణీయమని గిరిజన సంఘాలనాయకులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 15న గిరిజనులు ఆరాధ్య దైవంగా కొలిచే సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలని గిరిజన సంఘాలు కోరాయి. దీంతో తాజాగా ప్రత్యేక సీఎల్‌గా జీవో జారీ చేసిందని సంఘం నాయకులు చెప్పారు. గిరిజన ఉద్యోగులు ఈ సెలవును శనివారం స్పెషల్ సీఎల్‌గా వినియోగించుకునే అవకాశం కల్పించింది.

పాఠశాలలకు ప్రహరీ ఏదీ?

ప్రతిపాదనలకే పరిమితం

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చదువులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



ప్రహరీలేని గోకఫసల్వాద్ ఉన్నత పాఠశాల

దౌల్తాబాద్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని చదువుకోవలసిన దుస్థితి నెలకొంది. పాఠశాలలకు వెళ్లొచ్చేసరికి తల్లిదండ్రులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఏ విషయం వినాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందిస్తున్నామని చెబుతున్నా చాలా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పాఠశాలల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు విశ్రాంతి సమయంలో బయటకు వెళ్తున్నారు. ఆటలాడుతూ రోడ్లపైకి వెళ్లడంతో ఏ క్షణంలో ఏం జరుగుతోందని తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు, కుక్కలు, పందులు, కోతులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. కొన్ని బడుల్లో అయితే పాములు, విషపురుగులు, కీటకాలు వస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. దీంతో సెలవు రోజుల్లో బడి ప్రాంగణం అపరిశుభ్రంగా తయారవుతుంది. దీన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. రహదారి పక్కనే ఉన్న పాఠశాలల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

ప్రహరీలు లేనివి..

మండలంలో 45 ప్రాథమిక, 8 ఉన్నత, 8 ప్రాథమికోన్నత పాఠశాలున్నాయి. వీటిలో పలు పాఠశాలలకు ప్రహరీలు లేవు. మండల కేంద్రంలోని హరిజన్‌వేరి పాఠశాల, గోకఫసల్‌వాద్‌లోని ఉన్నత పాఠశాల, గుముడాల ప్రాథమికోన్నత పాఠశాల, తిమ్మాయిపల్లి, సుంకర్‌నగర్, నందారం, ఇందాపూర్, గుండేపల్లి, సుల్తాన్‌పూర్, తిర్మాలాపూర్ పాఠశాలలకు ప్రహరీలు లేవు. డైస్‌లో ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ నిధులు మంజూరుకాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధం

రూ. లక్ష వరకు ఆస్తి నష్టం

- బాధితులను పరామర్శించిన తహసీల్దార్ మురళీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్



ఘటనస్థలిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్, ఆంజనేయులు ముదిరాజ్

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ముత్యాలయ్య రోజులాగే గురువారం కుండలు చేసే పని పూర్తయిన తరువాత నిద్రించాడు. మధ్యరాత్రి కుండలు పెట్టే గుడిసె నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగి రేకుల ఇంట్లో వ్యాపించాయి. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వాటిని ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ మంటల ఎక్కువై ఇంట్లోకి వ్యాపించి దుస్తులు, ఆహారవస్తువులు దగ్ధమయ్యాయన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమికాలేదు. కానీ సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మురళీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి ఘటనస్థలిని పరిశీలించారు. తక్షణ ఆర్థిక సహాయంగా తహసీల్దార్ 10కిలోల బియ్యాన్ని అందించారు. ప్రభుత్వం తరఫున సహాయాన్ని అందించేందుకు జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నర్సింలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బార్ అసోషియేషన్ సభ్యులు

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

కొడంగల్ రూరల్: రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా కోర్టు హాల్లో దాడికి పాల్పడుతూ న్యాయవాదులపై దుర్భాషలాడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కొడంగల్ బార్ అసోషియేషన్ సభ్యులు శుక్రవారం విధులను బహిష్కరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవ్యవస్థ పవిత్రతను, చట్టపాలనను కాపాడుతూ హింసాత్మక చర్యలకు పాల్పడే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాగ్యలత, సీనియర్ న్యాయవాదులు పి.వెంకట్‌రెడ్డి, ఏవీ.ఆనంద్, పి.సుధాకర్‌రెడ్డి, టి.కరుణాకర్‌రెడ్డి, బస్వరాజ్, మురళీ మోహన్ నామాజీ, వెంకటయ్య, కె.రాములు, జూనియర్ న్యాయవాదులు బి.కృష్ణయ్య, కె.రమేశ్, పి.భానుప్రసాద్, రవీందర్‌నాయక్, మొహిద్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



ఎస్టీ వసతి గృహ బాలికలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి

తాండూరు టౌన్: ఆటంకాలు ఎదురైన ఆత్మవిశ్వాసంతో లక్ష్యసాధనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సాయిపూర్ ఎస్టీ బాలికల వసతిగృహాన్ని మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రత్నమాలతో కలిసి సందర్శించారు. వసతిగృహంలోని కిచెన్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్‌సింహారెడ్డి మాట్లాడుతూ.. ఏకాగ్రత, పట్టుదల విజయానికి సోపాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. హాస్టల్‌లో శుభ్రమైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యార్థులకు చెప్పారు. అనంతరం రత్నమాల మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నందున బాలికలు చదువుపై దృష్టి సారించి విజయ తీరాలకు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

గంజాయి పట్టివేత



గంజాయి పట్టుకున్న పోలీసులు

అనంతగిరి: వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో ఓ వ్యక్తి నుంచి 26 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. రైల్వే ఆఫీసర్ విశ్రాంతి భవనం పరిసర ప్రాంతంలో పశ్చిమబెంగాల్ హౌరా ప్రాంతానికి చెందిన సన్వీసేథ్ అనే వ్యక్తి వద్ద 26.798 కిలోల గంజాయి లభించింది. దీన్ని వైజాగ్ నుంచి ముంబాయికి తరలిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రేంకుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, శివ, రాం గణేష్, మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం, సీసీలపై ఫిర్యాదు

బొంరాస్‌పేట: మండలంలో ఐకేపీలో పనిచేస్తున్న ఏపీఎం, సీసీలు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారని మండల పరిధిలోని బురాన్‌పూర్ గ్రామ సంఘం–2 నాయకురాళ్లు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ గ్రామ సంఘానికి సీసీగా పనిచేస్తున్న సునీత, ఏపీఎం సత్యనారాయణచారి పర్యవేక్షణ సక్రమంగా చేయకుండా ఇష్టారాజ్యంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామ సంఘం వీఏఓ మంజుల నెలసరి గౌరవవేతనాన్ని తమ అనుమతి లేకుండానే నేరుగా సీసీ డ్రా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో గ్రామ సంఘం నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి, గ్రామ సంఘం అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి శ్రీశైలమ్మ, కోశాధికారి జయమ్మలు పాల్గొన్నారు.

జవాన్ల త్యాగం మరువలేనిది

ఎస్ఐ శ్రీశైలంయాదవ్



పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్ఐ శ్రీశైలంయాదవ్

బంట్వారం: దేశ రక్షణ కోసం అసువులుబాసిన జవాన్ల త్యాగం మరువలేనిదని బంట్వారం ఎస్ఐ శ్రీశైలంయాదవ్ పేర్కొన్నారు. పుల్వామా ఉగ్రదాడి జరిగి ఐదేళ్లు కావస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీశైలంయాదవ్ అమరవీరుల జ్ఞాపకార్థం పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం 40 మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు వీరజవాన్ల పేరు, రాష్ట్రంపేరు రాసి దేశ భక్తిని చాటుకున్నారు. విద్యార్థులు పోలీసులు పాల్గొన్నారు.

ఆడుకుంటూ.. అనంత లోకాలకు..

కిటికీ మీద పడి చిన్నారి మృతి



మృతురాలు చిన్నారి సోని (ఫైల్)

పరిగి: రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు వాళ్లవి.. పరిగిలో అడ్డమీద కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఓ తల్లి నాలుగేళ్ల కూతురును తీసుకుని పరిగికి పనికి వచ్చింది. కూతురు ఆడుకుంటూనే అనంతలోకాలకు వెళ్లిన ఘటన పట్టణ కేంద్రంలోని బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన చందిబాయి, హన్మంతు దంపతులకు ఇద్దరు సంతానం. కూతురు సోని(4) ఉన్నారు. దంపతులిద్దరు పరిగిలో అడ్డమీద కూలీపనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భార్యాభర్త కూతురిని తీసుకుని పరిగిలో శుక్రవారం అడ్డమీద కూలీకి వచ్చారు. భర్త తుంకలడ్డలో పనికి వెళ్లగా భార్య చందుబాయి బాలాజీనగర్‌లోని శ్రీనివాస్ రెడ్డి ఇంటి నిర్మాణానికి కూతురిని వెంటబెట్టుకుని వెళ్లింది. అక్కడ తల్లి పనిచేస్తుండగా సోని ఆడుకుంటుంది. అక్కడ కొత్తగా కడుతున్న ఇంట్లోని గోడకు నిలబెట్టిన కిటికీ దగ్గరకు వెళ్లి లాగింది. ఆ కిటికీ ఛాతి భాగాన, తలపై పడటంతో రక్తస్రావమైంది. వెంటనే చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కళ్లముందు ఆడుకుంటూ తిరుగుతున్న కూతురు మృతి చెందడంతో తల్లి రోధనలు మిన్నంటాయి. చిన్నారి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శీతల్



మాట్లాడుతున్న శీతల్

పరిగి: బాలికలు చదవుతోపాటు అన్ని రంగల్లోనూ రాణించాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శీతల్ సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయసేవాధికార ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని బాలసదన్, సబ్‌జైలును సందర్శించి వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం శీతల్ మాట్లాడుతూ.. బాలికలను ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని చెప్పారు. బాల్యవివాహాలు నిర్వహిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుగుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కౌన్సిల్ గౌస్‌పాషా, న్యాయవాదులు రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించలేదని బెదిరిస్తారా?

- చేయని పనులకు ఎలా మంజూరు చేస్తారు?
- ఎక్మాయి హెచ్‌ఎంకు పీఆర్టీయూ బాసట
- 'సాక్షి'కథనంతో కదిలిన ఉపాధ్యాయులు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: చేయని పనులకు బిల్లులు చెల్లించలేదని ఎక్మాయి హెచ్‌ఎం సుప్రియను కాంట్రాక్టర్లు బెదిరించడం బాధాకరమని పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం బషీరాబాద్ శాఖ అధ్యక్షుడు నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ధర్మిది వెంకట్‌రామ్‌రెడి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, ఈశ్వర్‌గౌడ్, రవీందర్ తదితరులు శుక్రవారం ఎక్మాయి పాఠశాలకు వెళ్లి హెచ్‌ఎంకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాలకు రూ.6.20లక్షల నిధులు మంజూరు చేస్తే మౌలిక సదుపాయాలు త్రాగునీటి వసతి, మరుగుదొడ్ల ఏర్పాట్లతో పాటు విద్యుదీకరణ వంటి పనులను అసంపూర్తిగా చేశారన్నారు. చేయని పనులకు బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులతో, విద్యాశాఖ జిల్లా అధికారులతో ఒత్తిడి తేవడంతో పాటు ఆమెను దుర్భాషలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేయని పనులకు బిల్లులు చెల్లించొద్దని గ్రామస్తులు కూడా ఆందోళన చేస్తుంటే విద్యాశాఖ జిల్లా అధికారులు చెల్లించాలని ఒత్తిడి తేవడం విడ్డూరంగా ఉందన్నారు. సాక్షిలో వచ్చిన కథనాన్ని ఉటంకిస్తూ ఉపాధ్యాయులు హెచ్‌ఎంకు బాసటగా నిలుస్తామని ప్రకటించారు. విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేస్తున్న హెచ్‌ఎం సుప్రియను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్, విజయ్ కుమార్, సంఘం బాధ్యులు శ్రీనివాస్ గౌడ్, ముస్తఫా, గోవర్ధన్ గౌడ్, భీమప్ప, ఎల్లప్ప, శ్రీనివాస్ సదాశివయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎక్మాయి హెచ్‌ఎం సుప్రియకు మద్దతు తెలుపుతున్న పీఆర్టీయూ జిల్లా, మండల నాయకులు

పాలెం విద్యార్థుల పొలం బాట



అవుసుపల్లిలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేసిన సామాజిక చిత్రపటం

ధారూరు: మండల పరిధిలోని అవుసుపల్లిలో శుక్రవారం పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామీణ కృషి అనుభవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త డాక్టర్ యమున, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడారు. గ్రామంలోని వివిధ వనరులు, పండించాల్సిపన పంటలు, నేల రకాలు, వాటి స్వభావాన్ని వివరించారు. పంటల సాగులో రైతులు తీసుకుంటున్న మెళకువల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సర్వే నిర్వహించిన కళాశాల విద్యార్థులు సామాజిక చిత్రపటాన్ని వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రీకర్‌రెడ్డి, సూర్యానాయక్, నాగేంద్రకుమార్‌ఝూ తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇస్తామంటూ భూములు పట్టా

- ఖాతాలో డబ్బులేని చెక్కులు ఇచ్చి మోసం చేశారని ఆరోపణ
- పోలీసులు, తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధిత రైతులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

కుల్కచర్ల: మార్టిగేజ్ లోన్ ఇస్తామని చెప్పి తమ భూములను సేల్‌డీడ్ చేసుకున్నారంటూ అంతారం గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంగారి వెంకటేశ్, కావలి పాండు, కావలి కృష్ణయ్య, కావలి లక్ష్మయ్య, కావలి రాములు, కావలి శ్రీనివాస్ షాద్‌నగర్‌కు చెందిన దేవరెడ్డి రత్నమ్మ దగ్గర రూ.45లక్షలు అప్పు తీసుకునేందుకు తమ భూములు తనఖా పెడతామని ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో 2024 నవంబర్ 28న ఆరుగురు రైతులకు చెందిన 5.32 ఎకరాల భూమి సేల్‌డీడ్ అయింది. కాగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు అప్పుగా ఇవ్వాల్సిన రూ.45లక్షలకు యాక్సిక్ బ్యాంక్ షాద్‌నగర్ బ్రాంచ్‌కు చెందిన చెక్కులు ఇచ్చారు. రైతులు చెక్కులు బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా ఎలాంటి డబ్బులు లేదనడంతో విషయాన్ని స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు సేల్‌డీడ్ చేసుకున్నారని తెలియడంతో రైతులు ఆందోళనతో మధ్యవర్తిగా ఉన్న అంతారం మాజీ సర్పంచ్ కృష్ణను ఆశ్రయించారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరో ఇద్దరు మధ్యవర్తులున్నారని వారి నుంచి డబ్బులు ఇప్పిస్తామని లేదంటే మీ భూములను మీ పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ రెండు నెలలుగా నెట్టుకొస్తున్నారు. మోసపోయామని గుర్తించిన రైతులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము తెలియక చేశామని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేయాలంటూ తహసీల్దార్ మురళీధర్‌ను వేడుకున్నారు. ఈ విషయమై ఎస్ఐ అన్వేశ్‌రెడ్డిని వివరణ కోరగా అంతారం గ్రామానికి చెందిన రైతులు తమ భూములు మార్టిగేజ్ చేసుకుంటామని చెప్పి సేల్ డీడ్ చేసుకున్నారని.. అప్పుగా ఇవ్వాల్సిన డబ్బులు సైతం ఇవ్వలేదని పిర్యాదు చేశారని ఆ విషయమై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రుణాలు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్

సాధారణంగా రైతులు బ్యాంకుల్లో అప్పు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసేందుకు వెళ్లిన సందర్భంలో అప్పు చూపుతంది. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉండదు. ఈ 5.32 ఎకరాలపై సూమారు రూ.5లక్షల రుణం ఉన్నప్పటికీ తహసీల్దార్, సిబ్బంది ఎలాంటి ఆక్షేపణ చేయకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారాయంటూ ఆరోపణలు ఉన్నాయి.

క్రాప్ లోన్లు ఉన్నా రిజిస్ట్రేషన్

రైతులు స్లాట్ బుక్ చేసుకుని మా వద్దకు వచ్చారు. క్రాప్ లోన్లు తక్కువగా ఉన్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు చేశాం. రైతులకు డబ్బు ఇచ్చారా లేదా మా పరిధికి రాదు. క్రాప్ లోన్లు ఉన్నా రిజిస్ట్రేషన్ చేయవద్దని నిబంధనలు ఏమీ లేవు.

– మురళీధర్, తహసీల్దార్, కుల్కచర్ల

జస్టిస్ షమీమ్ అక్తర్ రిపోర్టుపై నిరసన

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన జస్టిస్ షమీమ్ అక్తర్ రిపోర్టుపై జిల్లా మాల మహానాడు నిరసన వ్యక్తం చేసింది. సంఘం ఆధ్వర్యంలో వికారాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిపోర్టు పత్రాలను తగులబెట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాలలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో దళితుల రిజర్వేషన్‌ను 15 నుంచి 20 శాతానికి.. మాల సామాజిక వర్గానికి ఎనిమిది శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివరాజ్, ఆనందం, రాజు, రాములు, అనంత రాములు, వసంత్ కుమార్, ప్రేమ్ కుమార్, రత్నం, మల్లయ్య బి.శ్యామ్‌కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు

భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫ్లోబస్ సభ్యులు

ధారూరు: ధారూరు మండలంలోని కుక్కింద, నాగసమందర్, ధారూరు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఫ్లోబస్ కార్యక్రమం నిర్వహించారు. రోబోటిక్స్, ఏఐ, ఏఆర్, వీఆర్, డ్రోన్స్, త్రీడి ప్రింటింగ్ తదితర 16 రకాల అత్యాధునిక సాంకేతికతలు ప్రదర్శించారు. విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతలను ఆసక్తిగానే ర్చుకున్నారు. భవిష్యత్ అవకాశాలపై కొత్త దృక్పథాన్ని అవగాహన చేసుకున్నారు. విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్, సమస్యల పరిష్కారం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అవి ఉపయోగపడుతాయని ఫ్లోటీం ఫైండర్ సీఈఓ మధులాస్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోబస్ సభ్యులు దిలీప్‌కుమార్, పైలె ట్ రమేశ్, రోహిత్, దిండుబా, సాయి సుబ్రహ్మణ్యమ్, జిల్లా సైన్స్ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వ ర్, ప్రధానోపాధ్యాయులు కె. కడియాల వెంకట్‌చంద్రోశేఖర్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.